తొలకరితో వర్షాలు ముఖం చాటేయడంతో విత్తనాలు వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మొలకెత్తిన మొక్కలను కాపాడుకునేందుకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడుకు చెందిన పూదరి ప్రభాకర్ చేతిపంపుతో నీళ్లను పిచికారీ చేస్తున్నాడు. కౌలుకు తీసుకున్న రెండెకరాల్లో రూ. 5 వేలు ఖర్చు చేసి పత్తి విత్తనాలు వేస్తే.. వారం నుంచి చినుకు లేకపోవడంతో మొక్కలను కాపాడుకునేందుకు నీళ్లను స్ప్రే చేస్తున్నట్టు రైతు తెలిపారు. – ముత్తారం

కాళేశ్వరాన్ని కాపాడుకుందాం!

- పాలకుల కక్షసాధింపు చర్యలు తగవు
- కాంగ్రెస్ ప్రభుత్వానిది అవగాహనాలోపం
- కాళేశ్వరంతోనే పెరిగిన జీవనోపాధులు
- కరీంనగర్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చా వేదిక
- డాక్టర్ బీఎన్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ
- జలవనరుల నిపుణులు ప్రకాశ్ సహా ప్రముఖుల హాజరు

కాళేశ్వరం ప్రాజెక్టుపై కరీంనగర్‌లో జరిగిన చర్చా వేదికలో మాట్లాడుతున్న ప్రముఖ జల వనరుల నిపుణుడు వీ ప్రకాశ్

కరీంనగర్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): 'కాళేశ్వరం ఒక ప్రాజెక్టు మాత్రమే కాదు.. తెలంగాణ ప్రజల జీవనాధారం.. ఈ ప్రాజెక్టుతో చెరువులు, కుంటలకు నీళ్లొచ్చాయి. భూగర్భజలాలు పెరిగి పుష్కలంగా పంటలు పండాయి. అనతికాలంలోనే వ్యవసాయం, ఇతర వృత్తుల జీవనోపాధులు పెరిగాయి.. అని పలువురు వక్తలు వివరించారు. ప్రముఖ వైద్యుడు బీఎన్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లో 'కాళేశ్వరాన్ని కాపాడుకుందాం' అనే అంశంపై చర్చా వేదిక జరిగింది. ఈ సదస్సులో ప్రధాన వక్తగా ప్రముఖ జలవనరుల నిపుణుడు వీ ప్రకాశ్‌తోపాటు పలువురు ఇరిగేషన్ విశ్రాంత ఇంజినీర్లు పాల్గొన్నారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు మూలనపడితే గత యాసంగిల పంటలెట్ల ఎండిపోయాయి!? భూగర్భజలాలు ఇంకి భూమి ఎట్ల సెగలు కక్కింది? రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేయకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉన్నది. ప్రాజెక్టు కొట్టుకుపోవాలి. కేసీఆర్‌ను బదనాం చేయాలని ఆశించింది. ఇది పార్టీల మధ్య కొట్లాట కాదు. తెలంగాణ ప్రజల ఆస్తి. దీనిని కాపాడుకోవాలి' అని వక్తలంతా అభిప్రాయపడ్డారు.

కాళేశ్వరంపై రేవంత్‌రెడ్డివి పచ్చి అబద్ధాలు: వీ ప్రకాశ్

కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ప్రముఖ జల వనరుల నిపుణుడు వీ ప్రకాశ్ తెలిపారు. అసలు ఈ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డికి అవగాహనే లేదని స్పష్టంచేశారు. ఎక్కడైనా బ్యారేజీలు ఇసుకలో నిర్మిస్తారా? అని రేవంత్‌రెడ్డి పదేపదే అన్నారని, బ్యారేజీలు ఇసుకలోనే నిర్మిస్తారనే విషయంపై ఆయనకు అవగాహన లేకపోవడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీకి 86 పియర్స్ ఉంటే మూడు పియర్స్ మాత్రమే దెబ్బతిన్నాయని, అంతమాత్రన ప్రాజెక్టును మూలన పడేస్తారా? అని ప్రకాశ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను ఓడించాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్, బీజేపీ కాళేశ్వరంపై విషప్రచారం చేశాయని విమర్శించారు. డ్యాంసేఫ్టీ అథారిటీ కూడా ఆ పార్టీలకే వంతపాడిందని చెప్పారు. తెలంగాణ ఆవశ్యకతపై ఇక్కడి ప్రజలకు సోయి తెప్పించగలిగామని, అదే నీళ్లపై సోయి తెప్పించలేక పోయామని, మేధావులు ఇప్పుడు అదేపనిలో ఉండాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయిన నాయకుడని, కోటి ఎకరాల మాగాణాన్ని చూడాలనేది ఆయన స్వప్నమని, ఇందుకోసం కొన్ని వేల గంటలు నిపుణులతో ఆయన చర్చలు జరిపిన సందర్భాలను తాను ప్రత్యక్షంగా చూశానని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయతో వేలాది చెరువులు బలోపేతమైన విషయాన్ని మర్చిపోవద్దని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ముందు, తర్వాత పరిస్థితులను గమనిస్తే కేసీఆర్ ప్రభుత్వం సాగునీటికి ఎంత ప్రాధాన్యం ఇచ్చిందో అర్థమవుతుందని చెప్పారు.

రేవంత్ పదేండ్లు సీఎంగా ఉన్నా తుమ్మిడిహెట్టి సాధ్యంకాదు

సీఎం రేవంత్‌రెడ్డి పందేండ్లు సీఎంగా పనిచేసినా తుమ్మిడిహెట్టి బ్యారేజీ సాధ్యంకాదని వీ ప్రకాశ్ తేల్చిచెప్పారు. రెండు లక్షల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో ఈ బ్యారేజీ నిర్మించే ప్రయత్నంలో ఉన్నారని, అనుమతుల కోసం కేంద్రానికి నివేదిక పంపారని వివరించారు. కాళేశ్వరం కరెంట్‌పైనా కోదండరాం కూడా పచ్చి అబద్ధాలు చెప్పారని, స్టాండ్‌బైగా ఉండే కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక్క సీజన్‌లో 6,946 మెగావాట్ల విద్యుత్తు ఖర్చవుతుందని, ఎకరాకు రూ.46 వేల బిల్లు వస్తుందని కోదండరాం స్వార్థబుద్ధితో అసత్యాలు, అర్ధసత్యాలు ప్రచారం చేశారని చెప్పారు. కేసీఆర్‌పై కక్షతో తెలంగాణ ప్రజలకు నష్టం చేస్తారా? కాళేశ్వరం ఏమైనా కేసీఆర్ సొంత ఆస్తా? అని ప్రశ్నించారు. మేడిగడ్డ పియర్లు కుంగిపోవడానికి కారణాలేమిటనేది ఇప్పటివరకు ఏ దర్యాప్తు సంస్థ కూడా పూర్తిస్థాయి నివేదిక ఇవ్వకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నదని, ఇది నాణ్యతాలోపమా, నిర్వహణ లోపమా? అర్థంకావడం లేదని స్పష్టంచేశారు. 2019లో 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించిన తెలంగాణలో ఐదేండ్లు కోటికి పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందంటే కారణం కాళేశ్వరం ప్రాజెక్టు కాదా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును ముంచేందుకే ప్రధాని మోదీ, వెదిరె శ్రీరాం ఇచ్చంపల్లి ప్రాజెక్టును ప్రతిపాదిస్తున్నారని, నదుల అనుసంధానం వెనుక తెలంగాణను ఎడారి చేసే కుట్ర దాగున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. తాను ఏ పార్టీలో లేనని, రాజకీయాలతో సంబంధం లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ ప్రజలు ఉద్యమించాలని, మేధావి వర్గం ఇందుకు కృషి చేయాలని ఆయన కోరారు.

ఇలాంటి ప్రాజెక్టునే చూడలేదు: రిటైర్డ్ ఎస్ఈ సత్యనారాయణ

నీటి పారుదలశాఖలో ఏఈగా ఉద్యోగంలో చేరి ఎస్ఈగా రిటైర్‌మెంట్ తీసుకున్నాను.. నా సర్వీసులో ఇలాంటి ప్రాజెక్టునే చూడలేదని ఇరిగేషన్ శాఖ రిటైర్డ్ ఎస్ఈ భీమనాథుని సత్యనారాయణ తెలిపారు. 1969లో నెహ్రూ శంకుస్థాపన చేసిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 1980లో పూర్తయ్యిందని వివరించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కేవలం మూడేళ్లలో పూర్తి చేశారని, ఎక్కడైనా నాణ్యతాలోపం ఉంటే ఉండవచ్చని, అనేక ప్రాజెక్టుల్లో ఇలాంటివి జరిగిన సందర్భాలు అనేకం ఉన్నాయని తెలిపారు. కానీ, ఇంత మొండిగా వ్యవహరించి రూ.వేల కోట్ల ప్రాజెక్టు పనికి రాదని వాదించడం మూర్ఖత్వమే అవుతుందని చెప్పారు.

కాళేశ్వరం.. తెలంగాణ గుండె : డాక్టర్ బీఎన్ రావు

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ ప్రజల గుండెకాయ అని బీఎన్ రావు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎన్ రావు పేర్కొన్నారు. 'కేవలం 3 పియర్లు కుంగిపోతేనే ప్రాజెక్టును మూలన పడేస్తారా? పనులు చేసేందుకు ఎల్‌అండ్‌టీ కంపెనీ ముందు కొచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించలేదు. ఇది ఏమైనా పార్టీల పంచాయితీనా? ఇది ప్రజల సొత్తు. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలంగాణ పౌరుడిపై ఉన్నదని చెప్పారు' ఇప్పుడు వందలాది మందితో మొదలైన ఈ ఉద్యమం రేపు వేలు, లక్షలు కావాలని పిలుపునిచ్చారు. మేధావి వర్గం ప్రజల్లో చైతన్యం తేవాలని కోరారు. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకోవాలని, అప్పుడే తెలంగాణకు బతుకుదెరువు ఉంటుందని సూచించారు. ఎంతటి ఉద్యమానికైనా తెలంగాణ మేధావులు, విద్యార్థులు, న్యాయవాదులు, వైద్యులు, జర్నలిస్టులు ఒక్కటి కావాలని కోరారు.

కేసీఆర్‌ను బదనాం చేసేందుకే: జగిత్యాల రైతు రాజం

కేసీఆర్‌పై కోపంతో ఆయనను బదనాం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నిరుపయోగం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని జగిత్యాల రైతు రాజం అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు కాళేశ్వరం వేస్ట్ ప్రాజెక్టు అంటున్నరని, ఇదే నిజమైతే ఇన్ని వడ్లు ఎట్ల పండినయ్ అని ప్రశ్నించారు. ఇక్కడి పనోళ్లు చాలక వేరే పనుల కోసం రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి ఉపాధి పొందారని తెలిపారు. కాళేశ్వరం వల్ల జీవనోపాధులు పెరిగాయని, ఎస్సారెస్పీ పునరుజ్జీవం పథకంతో మెట్ట ప్రాంతాలైన వేములవాడ, గంగాధర, రామడుగు, సిరిసిల్ల ప్రాంతాల్లో నీళ్లు పుష్కలంగా ఉంటున్నాయని తెలిపారు. గ్రామాల్లోని చెరువుల్లో గోదావరి నీళ్లు పారాయని చెప్పారు. రైతులంతా ఒక్కటి కావాలని, మేధావులు మేలు కొల్పలాని, లేకుంటే మునుపటి లెక్కనే తెలంగాణ ఆగమై పోతదని ఆందోళన వ్యక్తం చేశారు.

పల్లెల్లో బిందెసేద్యం!

మొదటిపేజీ తరువాయి...

ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. మిగిలిన జిల్లాల్లోనూ అంతంత మాత్రంగానే వర్షాలు కురిసినట్టు పేర్కొన్నది. ఈ సీజన్‌లో జూన్‌లో కురవాల్సిన వర్షం మే నెలలోనే కురిసింది. ఎర్రని ఎండలు దంచాల్సిన మే నెలలో 128శాతం అధిక వర్షం కురిసినట్టు వాతావరణ సంస్థ వెల్లడించింది. 24 జిల్లాల్లో అత్యంత ఎక్కువగా(లార్జ్ ఎక్సెస్) వర్షపాతం నమోదు కావడం గమనార్హం. ఐదు జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది.

రైతుల్లో ఆందోళన...

వర్షాలు ఆలస్యం అవుతుండడంతో సీజన్ ఏ విధంగా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసి భూములను సిద్ధం చేసుకొని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. మే, జూన్‌లో కురిసిన వర్షాలకు విత్తనాలు వేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వర్షాలు ఆలస్యమై ఆ విత్తనాలు మొలకెత్తే పరిస్థితి లేదు. ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో పత్తి విత్తనాలు మొలకెత్తక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వాస్తవానికి వర్షాధార పంటలైన పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర వంటి పంటల్ని రైతులు 60–75 మిల్లీ మీటర్ల వర్షాపాతం కురిసిన తర్వాతే విత్తుకోవాలి. అదే విధంగా ఆ పంటలు వేసే భూమి 15–20 సెం.మీలో తడిసిన తర్వాత మాత్రమే విత్తనాలను వేయాలి. రైతులు ముందే వేయడంతో ఇటు వర్షాలు లేకపోవడం, అటు భూమి లోపలి వేడితో విత్తనాలు పాడైపోతున్నాయి. రైతులకు పెట్టుబడి నష్టం మీద పడుతున్నది. మళ్లీ విత్తనాలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది.

నేడు దివ్యాంగ అభ్యర్థుల రిజల్ట్

మొదటిపేజీ తరువాయి...

అలాటయిన అభ్యర్థులకు పోస్టింగ్స్‌ను ఇచ్చే ప్రక్రియను ఆయా సొసైటీలు ముమ్మరం చేశాయి. దీంతో దివ్యాంగ అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. ఈవిషయమై 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దివ్యాంగుల అభ్యర్థుల ఆవేదనను ప్రస్తావించింది. ఎట్టకేలకు ట్రిబ్ స్పందించింది. దివ్యాంగ అభ్యర్థుల ఎంపిక జాబితాను నేటి సాయంత్రంలోగా వెల్లడిస్తామని స్పష్టం చేసింది. సర్టిఫికేట్ వెరిఫికేషన్, పోస్టింగ్ ఉత్తర్వులను కూడా సంబంధిత సొసైటీలు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అందిస్తామని వెల్లడించింది. దీనిపై దివ్యాంగ అభ్యర్థులు హర్షం వ్యక్తంచేశారు. ట్రిబ్ చైర్మన్, ఇతర అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

హాస్టల్ వెల్ఫేర్ అభ్యర్థులు ఆందోళన చెందొద్దు..

గురుకుల ఉపాధ్యాయ నియామక పత్రాలను అందుకున్న అభ్యర్థులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రక్రియను నేటి నుంచి (సోమవారం) చేపడుతున్నట్టు బీసీ, ఎస్సీ సొసైటీలు షెడ్యూల్‌ను ప్రకటించాయి. సబ్జెక్టులవారీగా అభ్యర్థులకు తేదీలు నిర్ణయించి సమాచారం అందించాయి. అయితే నేటి నుంచే హాస్టల్ వెల్ఫేర్ పోస్టులకు టీజీపీఎస్‌సీ రాత పరీక్షను నిర్వహిస్తున్నది. దీంతో ఆ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న గురుకుల అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. పరీక్ష రాసేది ఎలా..? అనే సందిగ్ధంలో పడ్డారు. ఈ విషయంపై 'అభ్యర్థుల్లో టెన్షన్' పేరిట 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై ట్రిబ్ స్పందించింది. టీజీపీఎస్‌సీ నిర్వహించే పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సి అవసరం లేదని స్పష్టం చేసింది. సొసైటీలు షెడ్యూలు చేసిన మరుసటి రోజు సర్టిఫికెట్ల ధ్రువీకరణకు హాజరుకావచ్చని వెల్లడించింది. ఈ మేరకు ట్రిబ్ చైర్మన్ ప్రకటన విడుదల చేశారు.

ఎట్టకేలకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

- జాప్యంపై ట్రాన్స్‌కో సీఎండీ ఆగ్రహం
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

జనగామ జిల్లా దేవరుప్పులలో బిగించిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్

దేవరుప్పుల, జూన్ 23 : జనగామ జిల్లా దేవరుప్పులలో ఎస్ఎస్–39 ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌కో అధికారులు బిగించారు. దేవరుప్పులలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి 15 రోజులైనా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు పోసుకున్న నారు, దున్నిన దుక్కులు ఎండిపోయాయి. పలుమార్లు రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఇదే విషయమై 'ట్రాన్స్‌ఫార్మర్ కాలి 15 రోజులాయె' శీర్షికన ఆదివారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జాప్యంపై సంబంధిత అధికారులపై ట్రాన్స్‌కో సీఎండీ ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో కదిలిన అధికార యంత్రాంగం వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మన్‌ను బిగించి రైతుల కష్టాలు తీర్చింది. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి, పరిష్కారానికి కృషి చేసిన 'నమస్తే'కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీలకు మొండి'చెయ్యే'!

మొదటిపేజీ తరువాయి...

ఎన్నికల తీరుతెన్నులు, అక్కడి పరిణామాలు చూస్తే ఏ పరిస్థితుల్లోనూ బీసీలకు ప్రస్తుతం ఉన్న 22.79 శాతం రిజర్వేషన్లను 43 శాతానికి పెంచే అవకాశమే లేదని స్పష్టమవుతున్నది. ఇదే విషయాన్ని బీసీ కమిషన్ కూడా ఇప్పటికే అనధికారికంగా తేల్చిచెప్పడంతో ప్రభుత్వం సందిగ్ధంలో పడ్డట్టు తెలిసింది.

పంచాయతీ ఎన్నికలపై డిసెంబర్‌లోనే ఈసీ ఆదేశాలు

2024, ఫిబ్రవరి 1తో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం పూర్తయ్యింది. మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల గడువు జూలైతో ముగుస్తుంది. 2025 జనవరితో మున్సిపల్ పాలకవర్గాల గడువు పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(3)(ఏ) ప్రకారం పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికలను ఐదేండ్ల పదవీకాలం ముగిసేలోపే నిర్వహించాలని ఎన్నికల సంఘం గత ఉత్తర్వుల్లో పేర్కొంది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 14(2) ప్రకారం పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగియడానికి మూడు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాలి. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియడంతో ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (లెటర్ నంబర్ 921/టీఎస్ఇసీ–పీఆర్/2023) డిసెంబర్ 14న కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వం ఎన్నికలకు పోవాలంటే సుప్రీం తీర్పు ప్రకారం బీసీ కమిషన్ నివేదిక తప్పనిసరి.

అధికారంకోసం హామీల వల

రాష్ట్రంలో ఎలాగైనా అధికారం దక్కించుకునేందుకు కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో అనేక హామీలు గుప్పించింది. కామారెడ్డిలో ఏకంగా బీసీ డిక్లరేషన్ విడుదల చేసింది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కులగణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీ రిజర్వేషన్లు పెంచుతామని స్పష్టమైన హామీ ఇచ్చింది. స్థానిక సంస్థల్లో ప్రస్తుతమున్న 23 శాతం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని చెప్పింది. ఫలితంగా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కొత్తగా 23,973 మంది బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని స్పష్టంచేసింది. బీసీ వర్గాలను ఉపకులాల వారీగా వర్గీకరించి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేస్తామని వెల్లడించింది. బీసీ కులగణన లేదా ఓటరు జాబితా ఆధారంగా ఇంటింటి సర్వే చేసి ఆ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ అమలుచేస్తామని చెబుతూ వస్తున్నది.

సాధ్యం కాదని చెప్పిన బీసీ కమిషన్?

కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌లో చెప్పినట్టుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రస్తుత 23 శాతాన్ని 43 శాతానికి పెంచడం ఎంతమాత్రం సాధ్యం కాదని బీసీ కమిషన్ తేల్చిచెప్పినట్టు తెలిసింది. కులగణనకు సంబంధించి చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ ఆధ్వర్యంలో బీసీ కమిషన్ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. కర్ణాటకలో 54 ప్రశ్నలతో చేసిన కులగణన మాత్రమే శాస్త్రీయంగా ఉన్నదని, మిగిలిన రాష్ట్రాల్లో చేసిన గణన ఏమాత్రం శాస్త్రీయంగా లేదని నివేదికలో వెల్లడించినట్టు తెలిసింది.

అన్నీ కలిపి 50శాతం దాటొద్దు

2019 జనవరిలో జరిగిన సర్పంచ్ ఎన్నికల సమయంలో సుప్రీంకోర్టు ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం దాటవద్దని స్పష్టం చేసింది. ఆ మేరకు 2011 జనాభా లెక్కల ఆధారంగా అప్పటి పంచాయతీరాజ్ అధికారులు రాష్ట్రంలో రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఆ మేరకే బీసీలకు 22.79 శాతం, ఎస్సీలకు 20.53, ఎస్టీలకు 6.68 శాతం చొప్పున కేటాయించారు. ఈ ప్రకారమే ఎన్నికలు నిర్వహించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి మొత్తం 50 శాతానికి మించే వీలులేదని, ఇందులోనూ రాజ్యాంగంలోని 243 డీ అధికరణం ప్రకారం ఆయా ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీల జనాభాను బట్టి ముందుగా వాళ్లకు కేటాయించిన తర్వాతే మిగతా బీసీలకు కేటాయించాలని చెప్పినట్టు తెలుస్తున్నది. ఈ క్రమంలో రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతం దాటకుండా ఉండాలన్న దానిపై ఆలోచన చేయాలని సూచించినట్టుగా తెలుస్తున్నది. ఎలా చూసినా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రిజర్వేషన్లు 50 శాతం మించరాదు. అలాంటప్పుడు రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలా సాధ్యమని అనధికారిక నివేదికలో బీసీ కమిషన్ ప్రశ్నించినట్టు తెలుస్తున్నది. సుప్రీంకోర్టును కాదని ప్రభుత్వం ఇవ్వజూసినా అది న్యాయస్థానాల్లో వీగి పోతుందని, తీర్పును అతిక్రమించి 50శాతం మించి రిజర్వేషన్లు అమలు చేసిన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఎన్నికలను నిలిపివేశారని కమిషన్ తన నివేదికలో స్పష్టం చేసినట్టు సమాచారం.

ఇటు ఆందోళన.. అటు సందిగ్ధం

బీసీ కమిషన్ నివేదిక ఎన్నిరోజుల్లో ఇస్తుంది? ఏ పద్ధతిని అనుసరిస్తుంది? రిజర్వేషన్ల స్థిరీకరణలో ఎలాంటి వాతావరణం నెలకొంటుంది అని బీసీ సంఘాల్లో ఆందోళన నెలకొన్నది. ప్రభుత్వం నుంచి స్పష్టత రాకుంటే కులగణన ఆధారంగానా? లేక ఓటరు జాబితా మేరకు నివేదిక ఇవ్వాలా? అన్న మీమాంసలో బీసీ కమిషన్ ఉన్నది. స్వతంత్రంగా ప్రక్రియ మొదలుపెట్టినా ప్రభుత్వ సహకారం లేకుంటే ఎలా? అన్న ఆలోచనలో పడ్డట్టు తెలిసింది. ఇటు ప్రభుత్వం కూడా కులగణన అయ్యాక ఎన్నికలకు పోవాలా? లేక దేశంలోని కొన్ని రాష్ట్రాలను అనుసరించి ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకొని ముందుకుపోవాలా? అన్న సందిగ్ధంలో పడినట్టు తెలుస్తున్నది. ఈ పరిణామాలను లోతుగా అధ్యయనం చేస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలయ్యే అవకాశాలు దరిదాపులో కనిపించడం లేదు. చేసేది లేక స్థానిక సంస్థల ఎన్నికలను దాటవేస్తూ ముందుకుపోవాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తున్నది.

పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని కన్నుమూత

- సంతాపం తెలిపిన మంత్రులు

మణుగూరు టౌన్, జూన్ 23: డోలు వాయిద్య కారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య (65) భద్రాద్రి జిల్లా మణుగూరులో కన్నుమూశారు. గొంతు సంబంధ వ్యాధితో బాధపడుతున్న ఆయన.. ఆదివారం కూనవరంలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర వైభవాన్ని ఆదివాసీ గ్రామాలకు వెళ్లి ఆయన వివరించేవారు. కనీస సౌకర్యాలు లేని గ్రామాలకు కూడా కాలినడకన వెళ్లి మరీ వనదేవతల చరిత్రను కళారూపంలో చాటి చెప్పేవారు. డోలు వాయిద్యకారుడైన రామచంద్రయ్యను 2022 జనవరి 26న కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసింది. 2022 మార్చి 28న ఢిల్లీలో నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి ఆయన పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. పద్మశ్రీ పురస్కారం అందుకున్న డోలు వాయిద్య కళాకారుడు తెలుగు రాష్ట్రాల్లో సకిని రామచంద్రయ్య ఒక్కరే కావడం విశేషం. రామచంద్రయ్య మృతిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ, రెవెన్యూ శాఖల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తదితర ప్రముఖులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

చీకట్లోనే సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్‌లోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం ఇంజినీరింగ్ డిప్లొమా ప్రవేశాల కోసం మొదటి దశ కౌన్సెలింగ్‌లో పవర్ కట్ సమస్య తలెత్తింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు కౌన్సెలింగ్ కొనసాగింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ పోవడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. తర్వాత కూడా అప్పుడప్పుడు ట్రిప్ అయ్యింది. చీకట్లోనే కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించాల్సి వచ్చింది. – ఎదులాపురం

'కరెంట్ తీయకండి సార్.. బాంచెన్!'

- సమస్యలు చెప్పేందుకు ఫోన్‌లు చేస్తే ఎత్తని విద్యుత్తు అధికారులు
- ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక వాట్సాప్ స్టేటస్‌ల ద్వారా వేడుకోలు

మునిపల్లి, జూన్ 23: 'అయ్యా మేము ఇంకా తిండి తినలేదు.. నిద్రపోలేదు.. మేము నిద్రపోయిన తర్వాత కరెంట్ తీసేసినా సరే. కానీ, తిండి తినక ముందు.. నిద్రపోక ముందు కరెంట్ తియ్యకండి సార్.. మీ కాళ్లు మొక్కుతాం బాంచెన్' అని సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని పలు గ్రామాల యువకులు విద్యుత్తు కోతలపై తమ ఫోన్లలో వాట్సాప్ స్టేటస్‌లలో పెట్టుకున్నారు. ఈ స్టేటస్‌లు స్థానికంగా వైరల్‌గా మారాయి. మునిపల్లి మండలంలో విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నాణ్యమైన కరెంట్ సరఫరా జరగడం లేదు. విద్యుత్తు కోతలు ఏర్పడి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తంచేశారు. కరెంట్ సమస్యలు చెప్పుకుందామని విద్యుత్తు అధికారులకు ఫోన్లు చేస్తే కాల్ లిఫ్ట్ చేయడం లేదని, తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక ఇలా వాట్సాప్ స్టేటస్‌లు పెట్టుకుని ఆవేదన తెలుపుతున్నామని వారు చెప్పారు. నెల రోజుల నుంచి క్రమం తప్పకుండా రాత్రి 10 గంటలు దాటితే కరెంట్ సరిగ్గా ఉండటం లేదని, ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో